3

# దేవుని కుమారుని ద్వారా రక్షణ

బైబిలు అంతటిలో యేసు క్రీస్తు ప్రధానాంశంగా నిలిచివున్నాడు. పాత నిబంధన ఆయన రాకడకొరకు సిద్ధపాటు చేస్తుంది. సువార్తలు ఆయన రాకడ గురించి చెప్తున్నాయి. మిగతా క్రొత్త నిబంధన పత్రికలన్నీ ఆయన రాకడలోని ప్రాముఖ్యతను వ్యక్తంజేస్తూ ఆయన తిరిగి వస్తున్నాడని ప్రకటిస్తుంది.

అందుచేత అపొస్తలుడైన యోహాను తన పత్రికలో కుమారుని ద్వారానే రక్షణ అనే మాట ప్రత్యేకంగా వ్యక్తం చేస్తూ తన పాఠకులను వారి విశ్వాసం యొక్క బలాన్నిబట్టి వారిని దృఢపరుస్తున్నాడు. "దేవుని కుమారుని ద్వారా రక్షణ" అనే పాఠముతో ప్రారంభిస్తున్నాడు. 2వ అధ్యాయం ఈ మాటలతో ప్రారంభిస్తూ:

> నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసు క్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు.

"నీతిమంతుడైన యేసు క్రీస్తు" మన రక్షణకు నిరీక్షణ ఆయనే!

ఈ పాఠములో యేసును గురించి యోహాను ఏమని వ్రాస్తున్నాడో మనం పరీక్షించగలం. ఆయన ఏమి చేశాడో చూడగలం. చిట్ట చివరగా మనం ఏమిచేయాలని ఆయన కోరుకుంటున్నాడో దాన్ని మనము గ్రహించగలం.

## యేసు ఎవరు?

**యేసుని గురించిన సత్యం: 1 యోహానులో యేసు చెప్పిన వివరణ**

యోహాను చెప్పిన రీతిగా యేసు ...

1. *"ఆరంభములో ఏమైయున్నాడో"* (1 యోహాను 1:1–3).[1]
2. *"జీవ వాక్కు"* (1 యోహాను 1:1; చూడు యోహాను 1:1, 14).
3. *"నిత్య జీవం"* (1 యోహాను 1:2; చూడు యోహాను 1:4; 14:6).
4. *"యేసు" – అనగా "రక్షణ"* (1 యోహాను 1:3, 7; చూడు మత్తయి 1:21, 25).
5. *"క్రీస్తు" – అనగా "అభిషిక్తుడు"* (1 యోహాను 1:3; 2:22; 5:1). 1 యోహాను పత్రికలో "క్రీస్తు" అనే పదం ఆయన దైవత్వాన్ని సూచిస్తుంది.
6. *దేవుని కుమారుడు, తండ్రి కుమారుడు* (1 యోహాను 1:3, 7; 2:22; 23; 4:9, 14, 15; 5:9). దేవుని కుమారుడు అనగా దేవుని స్వభావంగలవాడని అర్థం (యోహాను 10:32–38 మరియు 2 యోహాను 3, 4, 9 చూడు).
7. *"నీతిమంతుడు"* (1 యోహాను 2:1; 3:7; మరియు హెబ్రీయులకు 4:15 పోల్చి చూడు).

8. *ఉత్తరవాది* (1 యోహాను 2:1).
9. *మన పాపాలకు ప్రాయశ్చిత్తమైనవాడు* (1 యోహాను 2:2; 4:10).[2]
10. *రక్షకుడు* (1 యోహాను 4:14).[3]

## యేసుని గురించిన తప్పుడు బోధ

అనేక విధాలుగా యేసును వర్ణించినప్పటికి యోహాను తన పాఠకులకు దానికి సంబంధించిన తప్పుడు బోధల గూర్చి అప్రమత్తం చేశాడు, దానికి యేసును గూర్చిన తప్పుడు బోధలు గురించి, యేసుని గూర్చిన తప్పుడు బోధకుల గురించి అతడు గట్టిగా హెచ్చరించడం ఒక చక్కని అంశాన్ని సమయుక్తంగా మనకు అందించినట్టు ఈ పత్రికలో కనబడుతుంది. 2వ అధ్యాయంలో ఈ విధంగా వివరించాడు,

> చిన్న పిల్లలారా, యిది కడవరి గడియ. క్రీస్తు విరోధి వచ్చునని వింటిరి గదా ఇప్పుడను అనేకులైన క్రీస్తు విరోధులు బయలుదేరియున్నారు; ఇది కడవరి గడియ అని దీనిచేత తెలిసికొనుచున్నాము. వారు మనలోనుండి బయలువెళ్లిరి గాని వారు మన సంబంధులు కారు; వారు మన సంబంధులైతే మనతో కూడ నిలిచియుందురు; అయితే వారందరు మన సంబంధులు కారని ప్రత్యక్షపరచబడునట్లు వారు బయలువెళ్లిరి. అయితే మీరు పరిశుద్ధునివలన అభిషేకము పొందినవారు గనుక సమస్తమును ఎరుగుదురు. మీరు సత్యమెరుగనివారైనందున నేను వ్రాయలేదు గాని, మీరు దానిని ఎరిగియున్నందునను, ఏ అబద్ధమును సత్యసంబంధమైనది కాదని యెరిగియున్నందునను మీకు వ్రాయుచున్నాను. యేసు, క్రీస్తు కాడని చెప్పువాడు తప్ప ఎవడబద్ధికుడు? తండ్రిని కుమారుని ఒప్పుకొనని వీడే క్రీస్తువిరోధి. కుమారుని ఒప్పుకొనని ప్రతివాడును తండ్రిని అంగీకరించువాడు కాడు; కుమారుని ఒప్పుకొనువాడు తండ్రిని అంగీకరించువాడు. అయితే మీరు మొదటినుండి దేనిని వింటిరో అది మీలో నిలువనియ్యుడి; మీరు మొదటినుండి వినినది మీలో నిలిచినయెడల, మీరుకూడ కుమారునియందును తండ్రియందును నిలుతురు. నిత్య జీవము అనుగ్రహింతుననునదియే ఆయన తానే మనకు చేసిన వాగ్దానము. మిమ్మును మోసపరచువారినిబట్టి యీ సంగతులు మీకు వ్రాసియున్నాను. అయితే ఆయనవలన మీరు పొందిన అభిషేకము మీలో నిలుచుచున్నది గనుక ఎవడును మీకు బోధింపనక్కరలేదు; ఆయన ఇచ్చిన అభిషేకము సత్యమే గాని అబద్ధము కాదు; అది అన్నిటినిగూర్చి మీకు బోధించుచున్న ప్రకారముగాను, ఆయన మీకు బోధించిన ప్రకారముగాను, ఆయనలో మీరు నిలుచుచున్నారు. కాబట్టి చిన్న పిల్లలారా, ఆయన ప్రత్యక్షమగునప్పుడు ఆయన రాకడయందు మనము ఆయన యెదుట సిగ్గుపడక ధైర్యము కలిగియుండునట్లు మీరాయనయందు నిలిచియుండుడి. ఆయన నీతిమంతుడని మీరెరిగియున్న యెడల నీతిని జరిగించు ప్రతివాడును ఆయన మూలముగా పుట్టియున్నాడని యెరుగుదురు.

1 యోహాను 4:1-3లో యోహాను ఈ తప్పుడు బోధల గురించి యిలా వ్రాశాడు:

> ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి. యేసు క్రీస్తు శరీరధారియై వచ్చెనని, యే ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది; యే ఆత్మ యేసును ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు; దీనినిబట్టియే దేవుని ఆత్మను మీరెరుగుదురు. క్రీస్తు విరోధి ఆత్మ వచ్చునని మీరు వినిన సంగతి ఇదే; యిదివరకే అది లోకములో ఉన్నది.

ఈ తప్పుడు బోధకులు ఎవరు? మరియు వారు ఏమి బోధించారు? వారిని “మోసగాళ్ళనియు” అంత్య క్రీస్తనియు – అనగా యేసుకు వ్యతిరేకులని బోధించాడు. వారు మననుండి “బయటకు వెళ్ళినవారని” అన్నాడు (1 యోహాను 2:18, 19; 2 యోహాను 7–8 వచనాలు) – యింకోవిధంగా చెప్పాలంటే తప్పుడు బోధలతో కూడిన క్రైస్తవులు అనవచ్చు.[4] దీనికి తోడు వారి బోధలనుండి మనకు ఏమి అర్థమౌతుందంటే, వారు తొలి దినాలలోని జ్ఞాన తత్వ వాదమును, తప్పుడు బోధల తెగను అంగీకరించారని అర్థమవుతుంది. ఈ తెగవారు రెండవ శతాబ్దంలో జీవించినవారు.

“జ్ఞాన తత్వ వాదం” (Gnosticism) అనే మాట గ్రీకు పదంనుండి వచ్చినది. ఆ పదం “జ్ఞానం” (*gnosis*) అని అర్థమిస్తుంది. ఈ Gnostics అనే తెగకు చెందినవారు తమకున్న జ్ఞానం యితరులకు ఎవ్వరికీ లేదు అని విర్ర వీగేవారు. ఈ Gnosticism అనేక శాఖలుగా ఉన్నప్పటికి వారందరికి ఒకేరకమైన నమ్మకాలు కల్గివున్నాయి. వారి నమ్మకమేమనగా: ఆత్మ మంచిది కాని పదార్థ సంబంధమైన మిగతాది అంతా కూడ అనగా శరీరము, దుష్టమైనది. అందువల్ల దేవుడనేవాడు ఆత్మ గనుక ఆయన అన్ని విధాలుగా మంచివాడు అనగా ఈ భౌతిక సంబంధమైన శరీరంతో జీవించి మానవ శరీరంలో జీవించలేడు. అందువల్ల వారి విధానం చూచినట్టయితే దేవుడు శరీరధారిగా ఉండలేడు గదా!

అలాంటప్పుడు యేసు ఎవరు? Gnostics అనే వారికి రెండు భావాలున్నాయి. (1) యేసు క్రీస్తు నిజముగా శరీరంలో లేడు; ఆయన ఏదో శరీరంగా ఉన్నాడన్నట్లు మాత్రమే ప్రత్యక్షమయ్యాడు. యిలా అనేవాడికి యేసు భూమిపై జీవించినప్పుడు మూడు కోణాల్లో ఉన్న ఒక బొమ్మలాగా నిలిచివున్నాడని అర్థం వస్తుంది. అలాంటప్పుడు ఆయన యేసును పట్టుకోవాలంటే ఆ చెయ్యి ఆయన గుండా దూరి వెళ్ళిపోతుంది (2) దీని భావం యింకొక విధంగా ఉంటుంది. యేసు కేవలం మామూలు మనిషి అని అలాంటప్పుడు ఏదో ఒక సమయంలో – ఆయన బాప్తిస్మం సమయంలో – క్రీస్తు వచ్చి ఆయనలో నివసించాడని. అందువల్ల యేసు తన పరిచర్య కాలంలో, క్రీస్తు అనే వ్యక్తి వచ్చి ఆయనలో జీవించియున్నాడని అర్థమవుతుంది. చివరకు, ఆయన మరణించినప్పుడు, క్రీస్తు ఆయనలోనుండి బయటికి వెళ్ళిపోయాడని. చివరిగా అసలు మరణించిన యేసు పూర్తిగా మానవుడని అభిప్రాయపడతారు.[5] అలాంట ప్పుడు ఈ ఆలోచన ఈ విధంగావుంటే అసలు యేసు ఎవరు? క్రీస్తు ఎవరు? వీరిద్దరికి మధ్యగల వ్యత్యాసం ఏమిటి? యేసు మామూలు మనిషేనా, క్రీస్తు దైవ స్వరూపుడైన నిజంగా మనిషి కాదా.

ఈ రెండు దృక్పథాలను యోహాను త్రిప్పికొడుతున్నాడు. యేసు క్రీస్తు ఈ భూమిపై ఒకే వ్యక్తి అని నొక్కి వక్కానిస్తున్నాడు, ఆయనే శరీరధారిగా దేవుని కుమారుడిగా జీవించాడని స్పష్టం చేస్తున్నాడు. యేసే క్రీస్తని నమ్మనియెడల – ఆయన దైవమని, శరీరధారియైన దేవుడని– నమ్మనియెడల మనం “రక్షింపబడలేం” అనే విషయాన్ని యోహాను నిశ్శంకోశంగా హెచ్చరిస్తున్నాడు!

**యేసు యొక్క నిజ స్వభావానికి సాక్ష్యాలు**

యేసును మనం ఎందుకు నమ్మాలి? 1 యోహాను పత్రికలో మరొక చోట, యేసు తనను గురించి ఏమి చెప్పాడో, తన దైవత్వాన్ని గూర్చిన సాక్ష్యాన్ని బట్టి యేసు నిజానికి అదే

అయివున్నాడని మనం నేర్చుకొన్నాం.[6] ఆ సాక్షులు ఎవరు?

(1) *ఆయన అపొస్తలులు.* అపొస్తలులు విన్నవాటిని, కన్నవాటిని, తాకి చూచినవాటిని గూర్చి యోహాను చెప్పాడు. వారు, యేసు నిజంగా దేవుడని, నిజంగా మానవుడని పూర్తిగా నమ్మారు. యోహాను ఈ విధంగా అంటున్నాడు, "ఆ జీవము ప్రత్యక్షమాయెను; తండ్రి యొద్ద ఉండి మాకు ప్రత్యక్షమైన ఆ నిత్యజీవమును మేము చూచి, ఆ జీవమునుగూర్చి సాక్ష్యమిచ్చుచు, దానిని మీకు తెలియపరచుచున్నాము" (1 యోహాను 1:2).

(2) *ఆత్మయు, నీళ్లును, మరియు రక్తము.* 1 యోహాను 5:6–8లో యిలా చదువుతాం,[7]

> నీళ్లద్వారాను రక్తముద్వారాను వచ్చినవాడు ఈయనే, అనగా యేసుక్రీస్తే. ఈయన నీళ్లతో మాత్రమేగాక నీళ్లతోను రక్తముతోను వచ్చెను. **ఆత్మ** సత్యము గనుక సాక్ష్యమిచ్చువాడు **ఆత్మయే**. సాక్ష్యమిచ్చువారు ముగ్గురు, అనగా **ఆత్మ**యు, నీళ్లును, రక్తమును, ఈ ముగ్గురు ఏకీభవించి యున్నారు.

ఈ ముగ్గురు సాక్షులు యిలా చెప్పటానికి అంగీకరించారు. యిక్కడ "నీరు" అనే మాట యేసు యొక్క బాప్తిస్మానికి సాదృశ్యం. "రక్తము" అనేది ఆయన మరణానికి చెందినదని ఆయన పునరుత్థానానికి కూడ నిదర్శనం అని కొందరు నమ్ముతారు. "ఆత్మ" అనేది పరిశుద్ధాత్మ అనియు సర్వసత్యమనియు వివరించబడింది. ఆయన అబద్ధం ఆడనివాడు, యేసు యొక్క బాప్తిస్మ సమయంలో యేసు తన కుమారుడని దేవుడు సాక్ష్యం యిచ్చాడు.[8] యేసు యొక్క మరణ సమయంలో అనేక అద్భుతాలు జరిగాయి, సూర్యుడు చీకటిని కమ్మినాడు, భూకంపం సంభవించినది, దేవాలయంలో తెర మధ్యకు చినిగింది, తర్వాత పునరుత్థానం సంభవించింది. తర్వాత సువార్త ప్రకటించవలసిందిగా పరిశుద్ధాత్ముడు అపొస్తలులను ప్రోత్సహించాడు. తర్వాత ఎవరైతే బాప్తిస్మం పొందుతున్నారో వారికి పరిశుద్ధాత్మ అనుగ్రహించబడింది (అపొస్తలుల కార్యములు 2:38; 5:32). ఒక క్రైస్తవునిలో ఆయన జీవించడం ద్వారా ఆ వ్యక్తి రక్షించబడ్డాడు అనటానికి తార్కాణంగా నిలిచింది. తద్వారా యేసు తాను ఏమైయున్నాడని చెప్పాడో అదే అయివున్నాడని రుజువవుతున్నది. ఈ ముగ్గురు సాక్షులు యేసు దైవ స్వరూపుడైన దేవుని కుమారుడు అనే సత్యాన్ని అంగీకరించినవారుగా నిలిచియున్నారు.

(3) *దేవుడు.* యేసు యొక్క దైవత్వాన్ని గురించి దేవుడే సాక్షియై ఉన్నాడు. యోహాను యిలా వ్రాస్తున్నాడు,

> మనము మనుష్యుల సాక్ష్యము అంగీకరించుచున్నాము గదా! దేవుని సాక్ష్యము మరి బలమైనది. దేవుని సాక్ష్యము ఆయన తన కుమారుని గూర్చి యిచ్చినదే. దేవుని కుమారునియందు విశ్వాసముంచువాడు తనలోనే యీ సాక్ష్యము కలిగియున్నాడు; దేవుని నమ్మనివాడు ఆయన తన కుమారుని గూర్చి యిచ్చిన సాక్ష్యమును నమ్మలేదు గనుక అతడు దేవుని అబద్ధికునిగా చేసినవాడే. ఆ సాక్ష్యమేమనగా – దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను; ఈ జీవము ఆయన కుమారునియందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవముగలవాడు; దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవములేనివాడే (1 యోహాను 5:9–12).

యేసు తన కుమారుడని అనేక రీతులుగా దేవుడు సాక్ష్యమిస్తున్నాడు. ఆకాశంనుండి రెండు సందర్భాల్లో ఆయన మాట్లాడినాడు (మత్తయి 3:17; 17:5) మరియు ఆయన తన కుమారుడని

స్పష్టం చేసియున్నాడు. యేసు అద్భుతాలను చేయడానికి ఆయనకు సామర్థ్యతనిచ్చియున్నాడు, అలా చేయడం ద్వారా ఆయన దేవుని కుమారుడని ఋజువుపర్చబడినాడు (హెబ్రీయులకు 2:4; యోహాను 20:30, 31), యేసు ద్వారా మాత్రమే నిత్యజీవము అంటూ ఆయన క్రీస్తు ద్వారాను ఆయన అపొస్తలుల ద్వారాను ఋజువు చేశాడు, పైనుదహరించబడిన వాక్య భాగంలో యోహాను ప్రాముఖ్యంగా చెప్పేదేమంటే, ప్రతి విశ్వాసి దేవుని యొక్క సాక్ష్యమును "తనలో తాను" కలిగియుంటాడని – అది దేవుని కుమారుడైన యేసు ద్వారా యిస్తున్న రక్షణ, అది యేసు యొక్క దైవత్వానికి సూచనగా ఉన్నది.

**యేసు దైవం అన్న వాస్తవం యొక్క ఫలితాలు**

యేసుక్రీస్తు దైవం – కాని అది మనకు ఏ అర్థాన్నిస్తుంది? అది మొదటి శతాబ్దంలోయున్న ప్రజలకు ఏ అర్థాన్ని యిచ్చిందో అదే అర్థాన్నిస్తుంది. అదేమంటే, మనం గనుక రక్షించబడాలంటే దేవుని కుమారుడైన యేసును క్రీస్తుగా అంగీకరించవలసియున్నది!

గుడికి వెళ్ళేవారికి ఈ మాటలు అంత అర్థవంతంగా అనిపించకపోవచ్చు. కాని మొదటి శతాబ్దపు ప్రజలకు అదెంతో ప్రాముఖ్యమైంది. యేసు తనను గురించి ఏమని చెప్పుకొన్నారో దానిని మరింకెవ్వరు చెప్పుకోలేదు. యేసు శిష్యులు ఆయనను గురించి ఏమని చెప్పుకొన్నారో యింకెవ్వరి శిష్యులు అలా చెప్పుకోలేదు. ఈ లోకంలో యేసునందు ఎవరైతే విశ్వాసముంచరో మరియు సువార్తకు విధేయులు కారో వారు నశించిపోయినవారు అని వారు ఖచ్చితంగా చెప్పారు!

ఈ సాక్ష్యులు చెప్పింది గనుక వాస్తవము, ఖచ్చితమైనదయినట్టయితే, యేసు గనుక శరీరాకారంలోయున్న దేవుడైయున్నట్టయితే అది ఈ రోజుల్లో నిజమైన విషయమవుతుంది. ఆ మాటను బట్టి చూస్తే ఈ రోజు ప్రపంచంలో 70% ప్రజలు క్రైస్తవులు కాదన్న మాట, ప్రపంచంలో ఈ రోజు ఆరు బిలియన్ల ప్రజలు జనాభా ఉందనుకోండి దాంట్లో 5 బిలియన్ల ప్రజలు వయస్సు వచ్చిన వారనుకోండి అంటే 3.5 బిలియన్ల ప్రజలు నశించినారని అర్థం. ఎందుచేతనంటే, వారు దేవుని కుమారుడైన యేసు క్రీస్తునందు విశ్వసించలేదు, సువార్తకు విధేయత చూపనివారు కాబట్టి!

మేముకూడ క్రైస్తవులమేనంటూ చెప్పుకునేవారి గురించి కూడ మనం ఆలోచించవలసి యున్నది. యేసును గురించి వారేమనుకుంటారంటే, ఆయన చాలా "మంచి" వ్యక్తి అని, "గొప్ప" వ్యక్తి అని, "దివ్యమైన" ఉపాధ్యాయుడు లేక "బోధకుడు" అని. ఎవర్ని వెంబడించేకంటే ఆయన్ను వెంబడించడానికే వారు యిష్టపడతారు. కాని వారికున్న ఒక తప్పుడు ఉద్దేశమేమంటే, ఎవరైనా యేసునందు విశ్వాసముంచకుంటే శాశ్వతంగా నశించుదురు అనే విషయాన్ని తిరస్కరిస్తారు. ఈ రోజు క్రైస్తవ సంఘాలు అనబడినవాటిలో ఒక ఆధారంలేని అవగాహన ప్రసిద్ధిలో ఉంది. ఏమనగా ఒక విరుద్ధమైన సిద్ధాంతాన్ని అనేకులు బోధిస్తున్నారు, క్రైస్తవులుగా ఉండడం మంచిదని ఒకవేళ వారు యితర మత విధానమనబడినదాంట్లో సభ్యులుగా ఉన్నా అదేమి తప్పుకాదని, వారు నాస్తికులుగా ఉన్న ఫరవాలేదనియు యింకో అడుగు ముందుకు చెప్పాలంటే ఒక వ్యక్తి అతని/ఆమె నమ్మకాలను ఆధారం చేసుకుని మంచిగా జీవించినంత వరకు ఎలాంటి సమస్య ఉండదని అంటుంటారు సుమా!

మనకున్న యిష్టా అయిష్టాల్లోకల్ల క్రీస్తునందు విశ్వసించడం ఒక్కటే కాదు. ఒక వ్యక్తి

రక్షించబడాలి అంటే, దేవునికి ఉన్న ఒకే ఒక వికల్పం యేసు క్రీస్తు, అదే దేవునికి యిష్టం. సూర్యుడులేకుండ ఈ భూమిమీద మనం జీవించడానికి ఎలా సాధ్యపడదో, దేవునితో నిత్య జీవితానికి కుమారుడు లేకుండ సాధ్యం కానే కాదు సుమా!

## యేసు ఏమి చేశాడు?

ఇక్కడ మరో ప్రశ్న వేయడం అవసరమైయున్నది: "యేసు మనకోసం, మానవాళికి ఏమిచేశాడు?" వాస్తవానికి, మనమిక్కడ రెండు ప్రశ్నలు వేసుకోవాలి: "యేసు ఏమి చేశాడు?" మరియు "ఆయనేమి చేస్తున్నాడు?"

### యేసు ఏమి చేశాడు?

దేవుడు తన కుమారుని పంపియున్నాడని, లేదా యేసు ఈ లోకానికి రక్షకునిగా వచ్చాడని 1 యోహానులో దాదాపు ఆరు పర్యాయాలు మనకు చెప్పబడియున్నది. ఉదాహరణకు 1 యోహాను 2:2లో మనమిలా చదువుతాం, "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతి కరమైయున్నాడు."[9] 1 యోహాను 3:16 ఆయా యితర వాక్యాలకు ప్రతివిధిగా నిలుస్తుంది: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందనట్లు ఆయనను అనుగ్రహించెను.' '[10] యింకా యితర వాక్య భాగాల్లో "పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును; ఆయనయందు పాపమేమియు లేదు" (1 యోహాను 3:5), "అపవాది యొక్క క్రియలను లయపరచుటకే" ఆయన ప్రత్యక్ష్యమయ్యాడు (1 యోహాను 3:8) మరియు "మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను" (1 యోహాను 4:9), మరియు, "తండ్రి తన కుమారుని లోక రక్షకుడుగా ఉండుటకు పంపియున్నాడు" (1 యోహాను 4:14) అని మనం యింకా తెలుసుకుంటాం.

### యేసు ఏమి చేయుచున్నాడు

యేసు మనకు చేసిన మేలు గతంలో మాత్రమే కాదు అంటే భూమిపైకి వచ్చి సిలువలో మరణించడం ద్వారా మనలను రక్షించడాని కోసం. కాని ఆ మేళ్ళు యిప్పటికి ఉన్నాయి. యేసు యిప్పటికి ఆయన శిష్యులకు ఏదో మేలు చేస్తున్నాడు సుమా? అదేమి?

(1) *ఆయన రక్తం మనలను శుద్ధి చేస్తుంది.* క్రైస్తవులైనవారికి మంచి నిశ్చయత ఏమనగా "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).[11] యేసు మరణం మనకు ప్రాయశ్చిత్తార్థమైనదిగా నిలుస్తుంది. అది మనం క్రైస్తవులమైనప్పుడే కాదు, మనం క్రైస్తవులంగా ఉంటూ పాపం చేసినప్పుడు కూడ. దానికి ఫలితంగా, మనం క్షమించబడి పాపాలనుండి శుద్ధిచేయబడుతాము.

(2) *ఆయన మన పక్షంగా వాదించువానిగా ఉన్నాడు.* ఆయన తండ్రివద్ద మన మధ్యవర్తి,

“నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు” (1 యోహాను 2:1). యిదంతా చూచుటకు ఎలావుందంటే మనం పరలోక న్యాయస్థానంలో తీర్పుకొరకై నిలిచియున్నట్లు, అప్పుడు మన పక్షంగా వాదించడానికి యేసు తండ్రి యొద్ద నిలిచియున్నాడన్నట్లు ఆయన తండ్రితో యిలా అంటుండవచ్చు “తండ్రీ యిదిగో ఈ సహోదరుడు లేక ఈ సహోదరి పాపం చేసినాడు/చేసింది. అది ఎలా జరిగిందో నేను గ్రహిస్తున్నాను, ఎందుకంటే నేను మానవస్వభావం ద్వారా పాపం చేయకుండుండుట ఎంత కష్టమైన విషయమో నేను ఎరుగుదును. ఇప్పుడతడు ఎంతో పశ్చాత్తాపపడుచున్నాడు. దయచేసి యితణ్ణి/ఈమెను క్షమించండి, అతని శిక్షను చెల్లించడానికి నన్ను నేను అర్పించుకున్నాను.” యేసే గనుక మన లాయర్ (వకీలు) అయున్నట్టయితే ఆయనే కేసు గెలుస్తాడు; మనకు పాపక్షమాపణ లభిస్తుంది గదా!

(3) మన నిత్య జీవానికి ఆయన నిశ్చయతయైయున్నాడు. యోహాను యిలా వ్రాస్తున్నాడు, “దేవుడు మనకు నిత్యజీవము దయచేసెను; ఈ జీవము ఆయన కుమారునియందున్నది” (1 యోహాను 5:11). యోహాను పరిభాషలో యేసే నిత్య జీవమని. మనము ఆయనకు సంబంధించినవారమైతే మనము నిత్య జీవంలో మనం పాలుపంపులు కలిగియుంటాము. ఈ నాడు దాన్ని మనము కలిగియున్నామంటే క్రీస్తు జీవితంలో మనం కలసి పాల్గొంటున్నాం అని అర్థం. క్రైస్తవులని పిలువబడేవారికి నిత్యజీవమనేది జీవితం యొక్క స్వభావాన్ని సూచిస్తుంది. ప్రస్తుతం మనం అనుభవిస్తుంది రాబోవు సమయంలో మనం నిత్యం అనుభవించబోయే దాన్ని ముందుగా రుచిచూస్తున్నట్లు అంటే కొంత కాలానికి ఈ నిత్యత్వ విలువలు అంతులేని అవధులు, కాల సమయాలు ఎంతో అతీతమైనవిగా మనం *కొలవలేనంతగా* తయారవుతాయి. నిత్యత్వంలో, క్రీస్తుతో ఐక్యపరచబడిన మనకు ఒక గొప్ప నిశ్చయతయున్నది. యిక అది వీడని బంధంగా శాశ్వతంగా నిలిచిపోతుంది.

రక్షణను గురించి మాట్లాడాలంటే *మనం* క్రైస్తవులమయినప్పుడు రక్షించబడినామని చెప్పడం; క్రైస్తవులంగా జీవిస్తూ క్షమించబడుచున్నప్పుడు మనం *రక్షించబడుచూ* ఉన్నామని చెబుతాం, ఆ తీర్పు దినం తరువాత మనం శాశ్వతంగా రక్షించబడుతాము అని నిత్యత్వ బహుమానాలు కలిగియున్నామని చెబుతాం. అన్ని విషయాల్లోను రక్షణ కుమారుని ద్వారానే వస్తుంది, యేసు క్రీస్తు ద్వారానే, ఆయనే దేవుని కుమారుడు. ఆయన మనలను రక్షించడానికి మొదటిగా మరణించాడు. ఆయన రక్తం మనలను పరిశుద్ధపరుస్తునే ఉంటుంది, మనం నిత్యం జీవించడానికి ఆయనే కారకుడవుతాడు.

## యేసుకు కావలసిందేమిటి?

ఇక్కడ మూడవ ప్రశ్నకు జవాబు చెప్పవలసివుంది: “మనలనుండి యేసు ఏమి కోరుచున్నాడు, తన ప్రజలనుండి ఆయన ఏం కోరుచున్నాడు?” 2వ అధ్యాయంలోని ఎక్కువ భాగం దీనికి జవాబు వ్రాయడానికే వ్రాయబడింది. అందువల్ల 1 యోహాను 2:3–17 వరకు గమనిద్దాం:

> మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనిన యెడల, దీనివలననే ఆయనను ఎరిగియున్నామని తెలిసికొందుము. ఆయనను ఎరిగియున్నానని చెప్పుకొనుచు, ఆయన

ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు; వానిలో సత్యములేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను; ఆయనయందు నిలిచియున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు. మనమాయనయందున్నామని దీనివలన తెలిసికొనుచున్నాము.

ప్రియులారా, మొదటనుండి మీకున్న పూర్వపు ఆజ్ఞనేగాని క్రొత్త ఆజ్ఞను నేను మీకు వ్రాయుటలేదు; ఈ పూర్వపు ఆజ్ఞ మీరు వినిన వాక్యమే. మరియు క్రొత్త ఆజ్ఞను మీకు వ్రాయుచున్నాను. చీకటి గతించుచున్నది, సత్యమైన వెలుగు ఇప్పుడు ప్రకాశించుచున్నది గనుక అది ఆయనయందును మీయందును సత్యమే. వెలుగులో ఉన్నానని చెప్పుకొనుచు, తన సహోదరుని ద్వేషించువాడు ఇప్పటివరకును చీకటిలోనే యున్నాడు. తన సహోదరుని ప్రేమించువాడు వెలుగులో ఉన్నవాడు; అతనియందు అభ్యంతరకారణమేదియు లేదు. తన సహోదరుని ద్వేషించువాడు చీకటిలో ఉండి, చీకటిలో నడుచుచున్నాడు; చీకటి అతని కన్నులకు గ్రుడ్డితనము కలుగజేసెను గనుక తానెక్కడికి పోవుచున్నాడో అతనికి తెలియదు.

చిన్న పిల్లలారా, ఆయన నామమునుబట్టి మీ పాపములు క్షమింపబడినవి గనుక మీకు వ్రాయుచున్నాను. తండ్రులారా, మీరు ఆదినుండి యున్నవానిని ఎరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. యౌవనస్థులారా, మీరు దుష్టుని జయించియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. చిన్న పిల్లలారా, మీరు తండ్రిని ఎరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. తండ్రులారా, మీరు ఆదినుండి యున్నవానిని ఎరిగియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను. యౌవనస్థులారా, మీరు బలవంతులు, దేవుని వాక్యము మీయందు నిలుచుచున్నది; మీరు దుష్టుని జయించియున్నారు గనుక మీకు వ్రాయుచున్నాను.

ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును.

పైనుదహరింపబడిన వచనాల ద్వారా దేవుడు క్రీస్తు రక్తం ద్వారా విమోచింపబడిన వారినుండి ఏమి కోరుచున్నాడో అన్న విషయంమీద మనం ఏమి చెప్పగలం? నాలుగు విషయాలు యిక్కడ యిమిడియున్నవి.

(1) *మనం క్రైస్తవులముగా అయినప్పుడు ఏ సత్యాలను హత్తుకున్నామో వాటిని పట్టుకొనివుండాలంటూ యోహాను ఉద్దేశించియున్నాడు* (2:12-14). మూడు రకాల క్రైస్తవులు "చిన్నపిల్లలు," "తండ్రులు," మరియు "యువకులు" - వీరంతా 2:12-14 భాగంలో పేర్కొనబడినా, ఈ విభాగం ఒక ప్రత్యేకతను సంతరించుకుంటూ తర్వాత ఏమి జరగబోతుందో ముందేమి జరిగిందో అనడానికి ఎలాంటి వివరణ అవసరం లేని విభాగంగా నిలుస్తుంది. దీనిలోని ఒక ప్రత్యేకత ఏమంటే, యోహాను తన జాబితాలో క్రైస్తవులందరిని కలుపుకొస్తున్నాడు. వారంతా యేసు ఎవరో మరియు వారికి ఆయన ఏమి చేశాడో వారు గుర్తుంచుకోవాలని కోరుతున్నాడు. అతడిలా వ్రాశాడు, "నీ పాపములు క్షమించబడినవి"; "మొదటినుండి ఉన్నవానిని నీవెరుగుదువు"; "దుష్టుని జయించియున్నావు"; "తండ్రిని నీవు ఎరిగియున్నావు"; "నీవు బలవంతుడవు నీలో దేవుని వాక్యము నివసించుచున్నది." కొంతమంది తప్పుడు బోధకులు తయారై ఎవరికీ తెలియని కొన్ని ప్రాముఖ్యమైన సత్యాలు వారికి తెలుసు అని విర్రవీగుచు, ఈ సత్యాలు రక్షణకు ఆధారాలు అంటూ, అప్పటి క్రైస్తవులతో వారికున్న క్రైస్తవ విశ్వాసము, నమ్మకాలు చాలా బలహీనమైనవి, దేనికి కొరగానివని నిరుత్సాహపర్చడం మొదలెట్టారు.

ఈ సందర్భంలో యోహాను వారిని ప్రోత్సాహపర్చుచు వారికున్న విశ్వాసము ఎంత మాత్రం బలహీనమైనదని తక్కువ అంచనాలేయవద్దు అని వారితో అంటూ వారిని ప్రోత్సహించడానికి ప్రయత్నం చేశాడు. వారు చేయవలసిందెల్లా ఏమనగా వారు తెలుసుకొనియున్నదాన్నే వారు మరలా మరలా నమ్ముతూ యితరులకు కూడ బోధించాలని కోరినాడు.

(2) *మనం ఆజ్ఞలను తూచతప్పక పాటించవలెనని యోహాను కోరినాడు* (2:3-6). వాస్తవంగా అతడు చెప్పినదేమంటే, "ఆయనను ఎరిగియున్నానని చెప్పుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు; వానిలో సత్యములేదు" (1 యోహాను 2:4). దానికి విరుద్ధంగా, "ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను; ఆయనయందు నిలిచియున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు. మనమాయనయందున్నామని దీనివలన తెలిసికొనుచున్నాము" (1 యోహాను 2:5; 6 వచనాలు చూడు). ఏ ఆజ్ఞలు మనం పాటించాలి? అన్ని ఆజ్ఞలు సుమా! ఎవరైనా వారి వారికనుకూలమైన ఆజ్ఞలను ఎంపిక చేసుకుని నేను కూడ యేసు క్రీస్తు అనుచరుణ్ణి అంటూ గొప్పలు చెప్పుకోవడానికెలా కుదురుతుంది? ఇది సబబుగా ఉందా? ఉదాహరణకు ఎవరైనా "క్రీస్తు నన్ను చేయమని చెబుతున్నాడు గదా అందుకు నా పొరుగువానికి మేలు చేస్తాను, కాని సంఘ కార్యక్రమాలకు లేక ఆరాధనకు వెళ్ళను, చందాలివ్వను. ఒకవేళ ప్రభువు అలా చేయమని ఆజ్ఞాపించినా చేయను అంటే కుదురుతుందా? లేదు అసలు అలా కుదరనేకుదరదు సుమా!"

(3) *సహోదరులను ప్రేమించాలని యోహాను మనలను కోరుచున్నాడు* (1 యోహాను 2:7-11). దేవుడిచ్చిన ఆజ్ఞలన్నింటిలో నుండి ఒకేదాన్ని చూస్తే "ఒకరినొకరు ప్రేమించుడి" అనే ఆజ్ఞ ఎంతో ప్రాముఖ్యమైనదంటూ యోహాను నిర్మొహమాటంగా చెబుతున్నాడు. అదేమి క్రొత్త ఆజ్ఞ కాదు అని యోహాను సూచిస్తున్నాడు. ప్రేమించండి అంటూ చెప్పబడిన ఆజ్ఞ అనేది మొదటి నుండి క్రైస్తవులు అనుసరించాలి అని ఆజ్ఞాపించబడిన ఆజ్ఞలకు సంక్షిప్తపరుస్తుంది. యేసు ఈ ఆజ్ఞను తన శిష్యులకు యిచ్చే సమయంలో అది "క్రొత్తది" అంటూ నొక్కి వక్కాణించాడు (యోహాను 13:34, 35).[13] ఇంకా యిలా అన్నాడు, మీరు గనుక వెలుగులో నడుస్తున్నామని చెప్పుకొంటూ మన సహోదరుని ద్వేషిస్తున్నామని చెప్పుకుంటే పాపము చేసినవారిమవుతామని, యింకా చీకటిలోనే నడుస్తున్నామని అర్థం. యేసు మనలను ఏమి చేయమని చెప్పినాడో దాన్ని తప్పక అనుసరించాలి. అంటే, మనం మన సహోదరులను, సహోదరీలను ప్రేమించ బద్ధులమైయున్నాము.

(4) *లోకాన్ని మనం ప్రేమించకూడదని యోహాను చెప్పినాడు* (1 యోహాను 2:15-17). ఇక్కడ "లోకం" అంటే మనం జీవిస్తున్న ప్రపంచం కాదు సుమా! లేదా దాంట్లో జీవిస్తున్న ప్రజలు కాదు. పాప భూయిష్టమైన స్వభావాన్ని, కార్యాలను త్యజించాలి. అవేవనగా "శరీరాశ," "నేత్రాశ," "జీవపుడంబము." మన జీవితాలు గనుక, ఆశలతో, డంబముతో నిండియుంటే తండ్రిని మనం ప్రేమించలేము.

ఆ తర్వాత యోహాను వ్రాస్తూ మనం లోకాన్ని ప్రేమించకుండ దేవుని ప్రేమించినట్టయితే కలిగే మేళ్ళను అందజేస్తున్నాడు: "లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి" (1 యోహాను 2:17). ఈ లోకాశలన్ని మనం అనుభవించి మనం కోరుకున్నదెల్లా నెరవేర్చుకున్నట్టయితే ఈ లోకం గతించిపోయినప్పుడు మనం వదలిపెట్టేదేమిటి? మనం మరణించి ఈ లోకాన్ని వదలి

పెట్టిన తర్వాత మనం సాధించిన వాటివల్ల ఏ మేలు లభిస్తుంది? ఏదేమైనప్పటికి "దేవుని చిత్తాన్ని నెరవేర్చువాడు నిత్యం జీవించును." మనం లోకాన్ని ప్రేమించకూడదు, దేవుని ప్రేమించాలి, ఆయన చిత్తాన్ని నెరవేర్చాలి. అప్పుడు మనం ఆయనతో నిత్యం జీవిస్తాం.

**ముగింపు**

యేసు శరీరధారియైన దేవుని కుమారుడు. ఈ లోక రక్షకుడగుటకు దేవుడు పంపించినవాడు ఆయనే. మనం క్రైస్తవులమైనప్పుడు ఆయన మన పాపాలనుండి మనలను రక్షిస్తాడు. తర్వాత క్రైస్తవులముగా మనం పాపము చేస్తున్నప్పుడు ఆయన రక్తం ద్వారా మనలను శుద్ధులనుగా చేస్తూ దేవుడు మనలను క్షమిస్తాడు. "నిత్య జీవితం కోసం" నిత్యంగా రక్షిస్తుంటాడు. ఏదెలావున్నా ఆయన ద్వారా రక్షింపబడినవారినుండి ఆయన కొన్నింటిని కోరుచున్నాడు. (1) మనం అంగీకరించిన సత్యాలకు మనం పూర్తిగా హత్తుకొనియుండాలి. (2) ఆయన ఆజ్ఞలకు విధేయులమై యుండాలి. (3) ఒకరినొకరం ప్రేమించుకోవాలి. (4) లోకాన్ని ప్రేమించడం వ్యతిరేకించాలి.

బహుశ మీరు చేసిన ఆలస్యంవల్ల బస్‌గాని రైలు గాని మీకు అందలేదనుకోండి. సరే ఆ సమయానికి అది ఎంతో దిగ్భ్రాంతి కలిగించియుండవచ్చు – కాని వెంటనే మరొక బస్ గాని లేక ట్రైన్‌గాని వచ్చి నీవెక్కడికి వెళ్ళాలనుకొంటున్నావో అక్కడికి నిన్ను తీసుకొని వెళ్ళి ఉండవచ్చు. ఏదెలాగైనా పరలోకానికి నీవు వెళ్ళడానికి, క్రీస్తుపట్ల విధేయత చూపాల్సిన అవకాశం యింకా నీవు పోగొట్టుకోలేదు సుమా! "పరలోకానికి వెళ్ళడానికి యింకో మార్గం ఉంది" అని నీవు చెప్పలేవు. క్రీస్తు ఒక్కడే రక్షకుడు (అపొస్తలుల కార్యములు 4:12). ఆయన యిలా అన్నాడు, "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6). నీవు గనుక క్రీస్తును పోగొట్టుకుంటే నీవు పరలోకాన్ని పోగొట్టుకుంటావు.

కుమారుని ద్వారానే రక్షణ సుమా! కుమారుని వద్దకు వచ్చి రక్షణ పొందుము. ఆయనయందు నమ్మికయుంచుము, నీ పాపముల విషయం పశ్చాతాపపడుము (లూకా 13:3), ఆయన దేవుని కుమారుడని ఆయనయందు నీ విశ్వాసాన్ని ఒప్పుకో (రోమీయులకు 10:9, 10), పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందుము. ఈ విధంగా చేయుము, అప్పుడు నీవు కుమారుని ద్వారా రక్షింపబడుదువు (అపొస్తలుల కార్యాములు 2:38).

---

సూచనలు

[1]సహజంగా వ్యాఖ్యాన కర్తలు ఈ పదజాలాన్ని క్రీస్తు వ్యక్తిత్వానికి ముడిపెట్టరు, కాని క్రీస్తును గురించిన సందేశానికి వర్తింపజేస్తారు. [2]"శాంతిపరచుట" (*hilasmos*) "పాపమును కప్పిపెట్టి వెనక్కు త్రోసివేయుట యొక్క ప్రాముఖ్యతను సూచిస్తూ శాంతిపరచుట" అని అర్థం యిస్తుంది. (W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* [Nashville: Thomas Nelson Publishers, 1985], 494.) [3]ఎక్కడో మరొక చోట ఈ యోహాను పత్రికల్లో యేసును గురించి మరొక పదం వాడ బడింది. అదేమంటే, "ఆ నామము" (3 యోహాను 7). [4]అబద్ధ బోధకులు "మా యొద్దనుండి బయలువెళ్ళిరి" అనే వాస్తవంనుండి యోహాను ఏ సంఘాలకు వ్రాస్తున్నాడో అవి విభజింపబడ్డాయని వాదించారు; వారికి 1 యోహాను 2:19 "యోహాను పత్రికల యొక్క పూర్వ చరిత్రను అర్థం చేసుకొనుటకు అతి ప్రాముఖ్యమైన వచనం" (Thomas F. Johnson, *1, 2, and 3 John,* New International Biblical Commentary [Peabody, Mass.: Hendrickson Publishers, 1993], 56). విశ్వాస భ్రష్టత్వం

అసాధ్యం అని నమ్ముతున్న క్యాల్విన్‌వాదులు ఈ వచనాన్ని, ఒకడు పడి పోయినయెడల అసలు అతడు క్రైస్తవుడు కానేకాదు అని వాదించుటకు ఉపయోగిస్తారు. యోహాను సంబోధిస్తున్నవారు ఒకవేళ అలాంటివారైయున్నప్పటికి, విశ్వాస భ్రష్ఠత్వం అనేది క్రైస్తవులు కానివారి మధ్య జరుగుతుందని నిరూపించలేరు. క్రొత్త నింధనలోని అనేక లేఖనాలు విశ్వాసంనుండి తొలిగిపోవుటను బోధిస్తున్నాయి. ఈ వాక్యంపై క్యాల్విన్ చేసిన వ్యాఖ్యానాన్ని Guy N. Woods, *A Commentary on the New Testament Epistles of Peter, John, and Jude* (Nashville: Gospel Advocate Co., 1983), 244-45, and Curtis A. Cates, "There Have Arisen Many Anti-Christs," *Denton Lectures* (1987), 137-38లో తిరస్కరించారు. [5]ఈ సిద్ధాంతమును మత విరోధియైన Cerinthus 2వ శతాబ్దములో బోధించాడు. (J. W. Roberts, *The Letters of John,* The Living Word Commentary [Austin, Tex.: R. B. Sweet Co., 1968], 5, 6, 131.) [6]యోహాను సువార్త యేసు యొక్క దైవత్వాన్ని గురించి ఎంతో ప్రత్యేకంగా నొక్కి వక్కాణిస్తుంది (యోహాను 5:33–47 చూడు). [7]1 యోహానులో యివ్వబడిన ఉపోద్ఘాతము చూడండి. KJV అనే ప్రచురణలో 7 మరియు 8 వచనాల్లోని సారాంశం మిగతా యితర ప్రచురణల్లో యివ్వబడలేదు. ఇంకో విషయమేమంటే, యోహాను రచించిన ఆదిమ వ్రాతల్లో అది లేదు కూడ. [8]అనేక వివరణలు ఉన్నప్పటికి "నీరు" యేసు బాప్తిస్మమును, "రక్తం" ఆయన మరణమును సూచిస్తుందని సామాన్యంగా నవీన వ్యాఖ్యాన కర్తలు ఏకీభవిస్తారు. (Edwin A. Blum and Glenn W. Barker, "1, 2, Peter; 1, 2, 3 John: Jude," *The Expositor's Bible Commentary with the New International Version* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1996], 144; Roberts, 130-31.) దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నిజముగా మరణించాడని దృఢపరచుటకే యేసు మరణం గురించి ప్రస్తావించబడింది. [9]1 యోహాను 4:10 యేసు మన "పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు" పంపబడినాడని వ్రాయబడింది. [10]అనుబంధంగా చూస్తే 1 యోహాను 3:16, యోహాను 3:16తో సమాంతరంగా ఉంటుంది. అది క్రొత్త నిబంధన అంతటిలో అతి ప్రియమైన వచనమై ఉంటుంది. 1 యోహాను 3:16 ఈ గ్రంథంలో మధ్య భాగంలో ఉంది, దాని సందేశం యోహాను పత్రికలో ముఖ్యమైనదిగా ఉంది.

[11]ఈ వచనంలోని క్రియలు వర్తమాన కాలాన్ని సూచిస్తుంది, అంటే ఆ పని కొనసాగుతునే ఉన్నది అన్నట్లు. [12]*Parakletos* అనే గ్రీకు పదం "ఒకని చెంతకు" పిలువబడిన దానిని సూచిస్తుంది (Vine, Unger, and White, 111). పరిశుద్ధాత్మ "Paraclete" – "ఆదరణ కర్త" (KJV) లేక "సహాయకుడు" NASB – యోహాను సువార్తలో చెప్పబడింది (ఉదాహరణకు యోహాను 15:26 చూడు). దేవుడు "వేరొక ఆదరణ కర్తను" [*Parakletos*] పంపుతాడని యేసు తన శిష్యులకు చెప్పాడు (యోహాను 14:16), ఆయనే ఆదరణకు మూలమని అర్థమిస్తుంది. *Paraclete* అనే పదానికి నానా అర్థాలు ఉన్నాయి! యిక్కడ ఈ పదం "న్యాయ సభలో ఒక న్యాయవాది యొక్క పనిని సూచిస్తుంది" (Woods, 222). [13]F. F. Bruce, *The Epistles of John: Introduction, Exposition and Notes* (N.p.: Pickering & Inglis, 1970; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 53-54.